


సభలకు పోలీసుల అనుమతి తప్పనిసరి: ఎస్పీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లావ్యాప్తంగా పోలీస్ వారి అనుమతి లేనిది సభలు సమావేశాలు నిర్వహించకూడదని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో సభలు, సమావేశాలు లేదా ర్యాలీలు నిర్వహించదలిచిన వారు రాతపూర్వకంగా సంభందిత పోలీసు అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తప్పకుండా పొందాలని సూచించారు. పోలీస్ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు లేదా ర్యాలీలు నిర్వహించరాదని, ఏ విషయాన్ని ఉద్దేశించి సభలు సమావేశాలు నిర్వహించదలిచారో దానికి కట్టుబడి ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు వాటికి విఘాతం కలిగించే ఏ చర్యలను కూడా తీసుకొని రాకూడదని పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాకాదని వ్యవహరిస్తే చట్టప్రకారం శిక్షాఅర్హులు అవుతారు, చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం

- నీటి విలువ తెలియని మూర్ఖుడు జగన్
- మద్యాన్ని ఏరుల్లా పారిస్తున్నాడు
- శ్రీకాళహస్తి నుంచే కురుక్షేత్ర యుద్ధానికి నాంది
- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫైర్


శ్రీకాళహస్తి రోడ్‌షోలో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సాగునీటి విలువ తెలీని మూర్ఖుడు జగన్ రాష్ట్రంలో మద్యాన్ని ఏరుల్లా పారిస్తున్నాడని టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతిపాలైందంటూ విరుచుకుపడ్డారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రోడ్ షో నిర్వహించారు. ఈ రాష్ట్రం ఒక సైకో, పిచ్చోడు, మూర్ఖుడు చేతిలోకి వెళ్లిపోతే ఏం జరుగుతుందో ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. టీడీపీ పాలనలో ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.22వేల కోట్లే ఖర్చు చేసిందని చెప్పారు. రాయలసీమ ప్రాజెక్టులకు తాము రూ.12వేల కోట్లు ఖర్చు చేస్తే.. జగన్ ముష్టి రూ.2వేల కోట్లు మాత్రమే పెట్టారని ధ్వజమెత్తారు. గాలేరు నగరి, హంద్రీనీవా, ఎస్ ఎస్ కెనాల్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఉమ్మడి చిత్తూరు జిల్లా సస్యశ్యామలవై ఉండేదని చెప్పుకొచ్చారు. ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడం చేతకాని జగన్ గాలేరు- నగరి నుంచి ఓ కాలువను తవ్వేందుకు, ఓ చెరువును నింపేందుకు ఎనిమిది వేల కోట్లు కేటాయించాడనీ, ఆ సొమ్మంతా మంత్రి పెద్దిరెడ్డి సంస్థ పిఎల్ఆర్ గ్రూపుకు వెళ్లేలా కాంట్రాక్టు ఇచ్చాడని మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి అవినీతిని ప్రశ్నిస్తాననీ, సాగునీటి ప్రాజెక్టులపై నిలదీస్తానని తాను పుంగనూరు రాకుండా పెద్దిరెడ్డి తమ్ముడు అడ్డుకున్నారని చెప్పారు. పోలీసుల సాయంతో వైసిపి మూకలను ఉసిగొలిపి టిడిపి కార్యకర్తలపై దాడి చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న తనను జగన్ బాబాయ్ వివేక మాదిరిగా గొడ్డలిపోటుతో హతమార్చాలని చూశారని ఆరోపించారు. పుంగనూరు విధ్వంసంఘటనకు నన్ను బాధ్యున్ని చేస్తూ ఎస్పీ స్టేట్మెంట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీ చేతుల్లో కీలు బొమ్మలుగా మారతారా అంటూ నిలదీశారు. జగన్ వద్ద ఉన్న కొందరు అవినీతి పోలీస్ బాస్‌ల వల్ల రాష్ట్రంలో ఉన్న పోలీసులు తమ కర్తవ్యాలను వదిలి, మనసు చంపుకుని అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారని వాపోయారు. ఇకనైనా పోలీసులు అవినీతి బాస్‌ల ఆదేశాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పుంగనూరు ఘటనలో నా పైన దాడి చేశారనీ, నా పైన దాడి చేస్తే ప్రజాస్వామ్యం పైన దాడి చేసినట్టేనని చెప్పారు. ఓ మాజీ ముఖ్యమంత్రి పైనే దాడికి దిగితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటో గమనించారని ప్రజలకు సూచించారు. జగన్ పాలనలో రాష్ట్రం 10లక్షల కోట్ల అప్పుల్లో కూలిపోయింది అని, టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అప్పుల నుంచి బయట పడేస్తానని హామీ ఇచ్చారు. ఐటీ రంగాన్ని అభివద్ధి చేసి యువతకు ఇంటా బయట ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి దోపిడీ జరుగుతోందన్నారు. ఆయన అవినీతికి అడ్డే లేకుండా పోతుందని మండిపడ్డారు. ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియా చేస్తూ కోట్లు గడించాడని ఆరోపించారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో రాహు కేతు టిక్కెట్లల్లో కూడా ఆయన కమిషన్ తీసుకుంటున్నాడని విమర్శించారు. 22ఏ చట్టాన్ని అమలు చేస్తూ విలువైన భూములను దోచేస్తున్నాడని దోచేస్తున్నాడని ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చాక నయా పైసలు సహా కక్కిస్తానని హెచ్చరించారు. రాష్ట్రం తిరిగి అభివద్ధి పథంలో నడవాలన్నా, రైతే రాజుగా ఉండాలన్నా, యువతకు ఉద్యోగాలు దక్కాలన్నా, కరెంటు చార్జీలు, నిత్యావసర ధరలు తగ్గాలన్నా, పరిశ్రమలు, ప్రాజెక్టులు రావాలన్నా, అప్పుల కుంపటి నుంచి రాష్ట్రం బయటపడాలన్న అది టిడిపితోనే సాధ్యపడుతుందని కితాబిచ్చారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. శ్రీకాళహస్తి నుంచి కురుక్షేత్ర యుద్ధానికి నాంది పలుకుతున్నామని, టిడిపి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి పనబాక లక్ష్మి, నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



నగ్న ప్రదర్శనలు కీర్తి, ప్రతిష్టలా..?

- కేంద్రానికి మహిళలు సూటి ప్రశ్న
- జిల్లాలో స్త్రీలకు చైతన్యం నింపిన పోరుయాత్ర



ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : ఆర్ఎస్ఎస్‌లో అంతర్భాగమైన బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ... అంతర్జాతీయంగా భారతదేశ ఖ్యాతి పెంచిందంటూ మోడీ బృందం భుజాలెగరేస్తోంది. భారతీయ మహిళలను నడివీధిల్లో నగ్నంగా ఊరేగించడమా వీరి కీర్తిప్రతిష్టలు. కామాంధులు పెట్రేగి.. ఆరాధించాల్సిన ఆడవారిపై సామూహిక అత్యాచారాలు చేయడమా భరతమాతను పూజించడం. నిర్భయ, దిశ నుంచి నేటి మహిళా మల్లయోధుల ఉద్యమం వరకు మహిళా రక్షణను వేలెత్తి చూపిస్తూనే ఉంది. సృష్టికర్త ఆబ్రహ్మ... అతనని సృష్టించినది ఓ అమ్మ అని ఓసినీకవి అమ్మగొప్పతనాన్ని వెల్లడించాడు. అలాంటి అమ్మకు మోడీ ప్రభుత్వం ఇస్తున్న నీరాజనం హింస. దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై హింస రోజురోజుకి విపరీతంగా పెరుగుతోంది. అందుకు నిదర్శనమే దేశరాజదాని ఢిల్లీలో మహిళా మల్లయోధులు చేసిన ఆందోళన. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల పట్ల ఉన్న నిర్లక్ష్య దోరణికి నిదర్శనలు కోకొల్లాలు. అందుకే ప్రభుత్వాలు హింసను అరికట్టాలను ఐద్వా పోరుయాత్రకు నడుంకట్టింది.

చిన్నారులు, మహిళలపై నేరాలు విపరీతంగా పెరిగాయి. ఢిల్లీలో శ్రద్దావాకర్, బొంబాయిలో సరస్వతీ వైద్యునిపై అతిక్రూరంగా జరిగిన హత్యలు దేశానికి, సమాజానికి అప్రతిష్ట. దేశంలో ఏదో ఒక మూల ప్రతి నిమిషానికికో ఒక అఘాయిత్యం జరుగుతూనే ఉంది. వెలుగులోకి వస్తున్నవి కొన్ని మాత్రమే. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవి మరింత పెరిగాయి. అధికార పార్టీ ప్రతినిధులు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, సంగార్ వంటి వాళ్లు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడితే మోడీ ప్రభుత్వం వారిని రక్షించేందుకు పూనుకుంటోంది. పైగా బాధితులపై కేంద్రం చౌకబారు వ్యాఖ్యాలు చేస్తూ, అసత్యాలు ప్రచారం చేస్తూ భయపెడుతోంది. మోడీ పాలనలో మహిళలపై దాడులు ఒకటి కాదు రెండుకాదూ... ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో దళిత బాలిక మనీషాపై దారుణ అత్యాచారం చేశారు. చిన్నారి అసిఫాను చిదిమేశారు. నిందితులను కాపాడేందకు ప్రభుత్వమే పూనుకుంది, కేంద్ర ప్రభుత్వానికి మానవత్వం, సమానత్వం లేదని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. మహిళల పట్ల తేలికబావం ఉంది. స్త్రీలను రెండవస్థాయి వ్యక్తులుగా, లైంగిక వస్తువులుగా మనవాద బిజెపి బావిస్తోంది. ఫోక్సో చట్టాన్ని ఎత్తేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మహిళలపై ఆంక్షలు, అణిచివేతకు గురి చేసిన మనవాద సిద్ధాంతాన్ని తిరిగి సమాజంపై, మహిళలపై బలవంతంగా రుద్దతున్నారు. పాకిస్తాన్ కంటే భారతదేశం స్త్రీలకు ప్రమాదకరంగా మారింది. హైదరాబాదులో జరిగిన ప్రియాంక (దిశ) ఘటన ప్రజలను కలిచివేసింది. ఏపిలో కూడా ఇటీవల క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగింది. కృష్ణానది తీరంలో యువజంటపై దాడి చేశారు. గుటూరులో డెంటల్ విద్యార్థి హత్య, రమ్య హత్య, విశాఖలో వరలక్ష్మీ హత్య సంచలనం కల్గించాయి. రేపలెల్ల రైల్వేస్టేషన్‌లోనూ, విజయనగరంలో ఇద్దరు పిల్లల తల్లి ఇంటిలోనే గ్యాంగ్‌రేప్‌కు గురవ్వడం రాష్ట్రంలో నేరస్థితికి దర్పనం. మద్యం, మత్తు మందులు నేరాలు పెరగడానికి కారణమని సర్వేలు చెబుతున్నా అరికట్టడంలో ప్రభుత్వ చర్యలు శూన్యం. నిర్భయ, దిశా చట్టాలు ప్రచారానికే పరిమితమయ్యాయి. గుజరాత్‌లో ఆదానిపోర్టు, రాష్ట్రంలో అరకు ఏజెన్సీలు మత్తు మందుల వ్యాపారాలకు అడ్డాగా మారాయ, వారికి ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయని మహిళా సంఘాలు వెలుగెత్తి వెల్లడిస్తున్నారు.

మహిళపై పెరుగుతున్న హింస పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న దోరణి, నిందితులను వెనకేసుకొస్తున్న విచిత్ర పరిస్థితులకు వ్యతిరేకంగా ఐద్వా రాష్ట్ర వ్యాప్తంగా హింసపై మహిళల పోరుయాత్రను ప్రారంభించింది. చేయి చేయి కలుపుదాం.. హింసలేని సమాజం కోసం నడుద్దాం అంటూ నినాదిస్తూ రాష్ట్రం నలుమూలల జాతను చేపట్టింది. అడవారికి రక్షణ కల్పించలేని పాలకులకు అధికారం అవసరమా అని ప్రశ్నించింది. తిరుపతి జిల్లాలో సైతం రాష్ట్ర జాతతో మహిళల్లో చైతన్యం నింపింది. తమ ఆట, పాటలతో ఉత్తేజపరిచి ప్రభుత్వంపై పోరుకు సన్నిద్ధమైంది. అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలు సరిహద్దులుగా ఉన్న తిరుపతి అధ్యాత్మిక జిల్లాలో జాతకు ప్రజలకు బ్రహ్మరథం పట్టారు. ఊరు, వాడ పుష్పాభిషేకాలతో మీవెంటే మేమంటూ జతకట్టారు. అడుగడుగున ఆదరిస్తూ అధికారపక్షం అంతు చూద్దాం అంటూ అడుగులేశారు. ఆడవారిపై జరుగుతున్న అరాచకాలను అన్ని పక్షాలు అడ్డుకోవాలి అంటూ మేధావులు పిలుపునిచ్చారు. నిద్రనటిస్తున్న పాలకులరా నిజాన్ని వెల్లడించి, నిందితులను శిక్షించి, బాధితులకు బాసటగా నిలవండి. మహిళల మనోనిబ్బరానికి మరోసారి జోహార్లు...!

7న మహా ధర్నా

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు వేలాదిగా పాల్గొనండి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ, 45శాతం ఫిట్‌మెంట్‌తో విద్యుత్ ఉద్యోగులకు పిఆర్సీని అమలు చేయాలని కోరుతూ, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంకై ఈనెల 7వ తేదీ సోమవారం ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ముందు వేలాదిమందితో భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రకటించారు. యశోదానగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విద్యుత్ కార్మికులతో కలిసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో కార్మికుల బతుకు దినదిన గండంగా తయారైందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని ఏడు యూనియన్ల ఆధ్వర్యంలో కార్మిక సంఘాలతో పోరాట కమిటీ ఏర్పడిందని, ఈ కమిటీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. శనివారం నాటి ఉదయం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు జిల్లా నేతలు పాల్గొన్నారు. ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డివిజన్‌ల నుంచి వేలాదిగా తిరుపతికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సోమవారం నాటి ఉదయం 9 గంటలకు లక్ష్మీపురం సర్కిల్ నుంచి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన ఉంటుందని, 10 గంటలకు ధర్నా కార్యక్రమం జరుగుతుందని ప్రకటించారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, రమేష్, వి.నాగరాజు, జనార్ధన్, మునిరాజ, వేణుగోపాల్, టి. సుబ్రమణ్యం, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సిటీలో సిఐఇఎల్ కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రముఖ టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్, గ్రూప్ సిఐఈఎల్ తమ కార్యాలయాన్ని శ్రీసిటీలో ప్రారంభించిందని, ఆగ్రూప్ చైర్‌పర్సన్ మఫోయ్ కె.పాండియరాజన్ అన్నారు. శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ క్లస్టర్-అప్రోచ్ వ్యూహం ద్వారా విస్తతశ్రేణిలో దేశవ్యాపంగా కార్యకలాపాలు నిర్వహించాలని సైల్ ప్రయత్నిస్తూతుంది, దేశం ఆర్థిక అభివద్ధికి కీలక సహకారిగా ఉంటుందని అన్నారు. భారత ప్రభుత్వ, ఎంఎస్ డీఈ జారీ చేసినఎన్ ఏపిఎస్ (నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్) లైసెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా విస్తతంగా విస్తరించి, ట్‌లైన్ సూపర్‌వైజర్ల నుచంఇ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, ఫంక్షనల్ నిపుణుల వరకు పరిశ్రమ విభాగాలలో సరైన ప్రతిభ, ఖచ్చితమైన అవసరాన్ని సైల్ గుర్తించిందన్నారు. సైల్ కొత్త కార్యాలయం శ్రీసిటీ, చుట్టుపక్కల ఉన్న కంపెనీల ప్రతిభ అవసరాలను తీర్చడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సైల్ హెచ్‌ఆర్ఎండీ అండ్ సీఈఓ ఆదిత్య నారాయణ్ మిశ్రా మాట్లాడుతూ నిరంతరం అభివద్ధి చెందుతున్న మార్కెట్ డిమాండ్ల, శక్తివంతమైన ల్యాండ్‌స్కేప్, కొత్త సాంకేతికతల స్థిరమైన ఆవిర్భావం నేపథ్యంలో హెచ్‌ఆర్ సొల్యూషన్స్‌లో ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తుందన్నారు. వినూత్న హెచ్‌ఆర్ టెక్ సొల్యూషన్ అభివద్ధి చేయడం ద్వారా దేశంలోని హెచ్‌ఆర్ ల్యాండ్‌స్కేప్‌పై గణనీయమైన ప్రభావాన్ని చూపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాలు అందించడంలో అంకితభావం చూపాలి

డిప్యూటి సిఎం నారాయణస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటి సిఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

మానవసేవే మాధవసేవ అని నమ్మి మన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పేదలకు అండగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని, వాటిని అంకితభావంతో అందించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చూడాల్సిన భాధ్యత వుందని జిల్లా ఇంచార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి అన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో శ్రీకాళహస్తి నియోజకవర్గ సమీక్ష జిల్లా ఇంచార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి అధ్యక్షతన జిల్లా ప్రణాళిక శాఖ నిర్వహించగా శ్రీకాళహస్తి శాసన సభ్యులు బియ్యపు మధుసూధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జెసి డికె.బాలాజీ, ఆర్డిఓ రామారావు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హతగల ప్రతి పేదవాడికి అందాలని, అభివద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడానికే ప్రభుత్వఆదేశాల మేరకు ఇప్పటికే చంద్రగిరి, గూడూరు నియోజక వర్గాల సమీక్ష నిర్వహించామని, నేడు శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివద్ధి, సమస్యలపై ఉపముఖ్యమంత్రి అధ్యక్షతన శ్రీకాళహస్తి శాసన సభ్యులు సూచించ మేరకు అధికారుల పరిధిలో ఉన్నవాటికి పరిష్కారం చూపడం, అవసరాన్ని ప్రాదాన్యత తీసుకుని ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యే సంపదగా భావించి మన ముఖ్యమంత్రి ప్రతి పేదవాడికి చదువును దగ్గరచేస్తున్నారని, పేదలు సమాజంలో ఎదగాలనే ధ్యేయం తప్ప మరొకటి లేదని అందుకే కులాలు, మతాలు, రాజకీయాలు చూడకుండా పేదలే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. అధికారులు పేదలకు పథకాలు అందిచడంలో అంకితభావం చూపాలి అన్నారు. శ్రీకాళహస్తి శాసన సభ్యులు బియ్యపు మధుసూదన రెడ్డి మాట్లాడుతూ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎదురవుతున్నవి, జిల్లా హౌసింగ్ ఒక యజ్ఞంలా జరుగుతున్నదని, పేదలు జగనన్న కాలనీలలో తమ ఇళ్ళకు మట్టి తోలుకుంటుంటే కేసులు పెడుతున్నారని , తహశీల్దార్లు లబ్దిదారులకు టోకెన్ సిస్టం ఏర్పాటుతో పక్కగా అనుమతులు ఇచ్చేలా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రేణిగుంట తూకివాకం డంపింగ్ యార్డ్‌లో రేణిగుంట పరిసరాల చెత్తను సేగ్రిగేట్‌కు తిరుపతి మునిసిపల్ కార్పోరేషన్ అనుమతించాలని సూచించారు. జేసి డికె.బాలాజీ మాట్లాడుతూ జిల్లా అధికారుల వారిస్థాయిలో పరిష్కరిచాల్సిన అంశాలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఇక్కడ ఆ అంశాలు చర్చకు వస్తే సమయం వధా అవుతుందని అన్నారు. నియోజకవర్గ సమీక్షలో సూచించిన అంశాలపై అధికారులు దష్టి పెట్టాలని, ప్రభుత్వానికి నివేదించాల్సినవి వెంటనే పంపాలని సూచించారు.ఈ సమీక్షలో జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం సూచనలు తప్పక పాటించాలి

ఎస్ఎస్ఆర్-2024 జాబితా పక్కాగా తయారు కావాలి : కలెక్టర్


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ఎన్నికల సంఘం ఈనెల 2,3 తేదీల్లో విశాఖలో నిర్వహించిన సమీక్షలో ప్రత్యేకఓటర్ల జాబితా సవరణ -2024లో ప్రతి ఓటరు తొలగింపు, చేర్పులకు సంబంధించిన రికార్డులు నిర్వహణ వుండాలని ఎన్నికల కమిషన్ అడిగినప్పుడు చూపాల్సి వుంటుందని తేడా వుంటే చర్యలు తీవ్రగంగా వుంటుందని తెలిపారని ఆ మేరకు పక్కాగా వుండాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణ - 2024పై ఈఆర్ఓ , ఏఈఆర్ఓలతో జిల్లా కలెక్టర్, జేసిడి కే.బాలాజీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ఎన్నికల సంఘం సమీక్షకు హజరయ్యాయనని పలు సూచనలు చేశారని తప్పక పాటించాలని అలాగే ప్రతి ఓటరు రికార్డు వుండాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల సంఘం వారి యాప్ ఆన్‌లైన్ అప్ లోడ్ చేసినా తప్పనిసరిగా సంబంధిత ఫారమ్‌లో ఆ ఇంటివారి సంతకం వుండాలని అన్నారు. డోర్ నెంబర్‌కు సరిపడా ఓటరు కార్డు ఉండాలన్నారు. కొత్తవారి ఓటరు నమోదు పూర్తి స్థాయిలో జరగాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి బిఎల్‌ఓలు వెళ్లి ఓటరు వివరాలు సేకరిస్తున్నారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా ఈఆర్ఓ భాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. అందుకే ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు పర్యవేక్షణతో పక్కా ఓటర్ల జాబితా తయారులో భాగస్వామ్యులు కావాలన్నారు. ఫిర్యాదులు ఎన్నికల సంఘంకు పక్కా ఆధారాలతో అందిస్తున్నారని ఫిర్యాదు పరిశీలనలో నిజమని తేలితే చర్యలు తీవ్రతరం వుంటుందని అన్నారు. ఫారం-7 ఆధారంగా ఫోటో అప్డేట్ జరగాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటుతో నిర్ణయం తీసుకోవాలన్నారు. చిన్న పొరపాట్లు కూడా తావు లేకుండా చూడాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో బిఎల్ఓతో పాటు ఎట్టి పరిస్థితుల్లో వాలింటర్ వెళ్ళరాదు. బిఎల్ఓ మాన్యుయావల్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ఈనెల 21 లోపు ప్రతి ఇళ్లు తిరిగి నమోదు పూర్తి చేయాలని, ఓటరు తొలగింపు, చేర్పులకు పక్కా రికార్డులు వుండాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో వున్న ప్రతిఓటరు పరిశీలన అవసరం వుందని తెలిపారు. ఈ సమీక్షలో ఈఆర్వోలు గూడూరు కిరణ్ కుమార్, చంద్రగిరి కనక నరసారెడ్డి, తిరుపతి హరిత, శ్రీకాళహస్తి రామారావు, సత్యవేడు శ్రీనివాసులు, సూళ్లూరుపేట చంద్రముని, ఏఈఆర్వోలు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారులు పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి

ఆగస్టు 8న ముగియనున్న ప్రస్తుత బోర్డు పదవీ కాలం



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త ఛైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. ఇప్పుడున్న ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ప్రస్తుత టిటిడి బోర్డు పదవీకాలం ఆగస్టు 8తో ముగియనుంది.

అనుభవజ్ఞుడు, వివాద రహితుడు

ప్రస్తుతం తిరుపతి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి గతంలో కూడా తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ గా పని చేసిన అనుభవం ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2006 నుండి 2008 వరకు టీటీడీ ఛైర్మన్‌గా పనిచేశారు భూమన. వైఎస్సార్ జిల్లా, నందలూరు మండలం, ఈదరపల్లెలో జన్మించిన భూమన కరుణాకరరెడ్డి తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి బిఏ, ఎంఏ చదివారు. మహాత్ముడి ఆత్మకథ సత్యశోధనను భూమన ప్రత్యేక శ్రద్ధతో పునర్ముద్రించారు.

రాజకీయ ప్రస్థానం

రాజకీయాల్లో డాక్టర్ వైఎస్సార్‌కు సన్నిహితంగా ఉండేవారు. 2012లో తిరుపతి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సిపి అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2019లో తిరుపతి నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత నెలలో (జులై 2023లో) భూమనను సభా హక్కుల కమిటీ ఛైర్మన్‌గా నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. కాగా, తనను టీటీడీ ఛైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు కరుణాకర్ రెడ్డి. తాజా నియామకంతో రెండేళ్ల పాటు టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి: కమిషనర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివద్ధి పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణ పనులను, భవానీనగర్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మికక్షేత్రం కావడం వలన స్వామిదర్శనం కోసం ప్రతిరోజు సుమారు లక్ష మంది భక్తులు వస్తూ ఉంటారన్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సుమారు రూ.50కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో ఆరు అంతస్థుల మల్టీ లెవెల్ కార్‌పార్కింగ్ భవన నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ భవన నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయని వచ్చే సంవత్సరం ఆగస్ట్ మాసానికి పూర్తి చేస్తామన్నారు. రూ.80కోట్ల రూపాయల స్మార్ట్‌సిటీ నిధులతో లక్షా యాభై వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని అన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, స్మార్ట్‌సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డీఈలు దేవిక, మోహన్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ తదితరులు ఉన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన...

బాలాజీ కాలనీలోని ఫ్రీలెఫ్ట్ వద్ద జరుగుతున్న సుందరీకరణ, పెయింటింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం బాలాజీ కాలనీలోని ఎస్వీ సంగీత నత్యకళాశాల వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫ్రీ లెఫ్ట్ కూడలిలో పూలమొక్కలు ఎక్కువగా నాటాలన్నారు. అలాగే పెయింటింగ్ పనులు మరింత వేగంగా చేయాలన్నారు. ఎస్వీ సంగీత నత్య కళాశాల బోర్డు కూడా బాగా కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల ప్రహరీగోడ కు రంగులు వేయించాలన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, తదితరులు ఉన్నారు.

రిలయన్స్ ట్రెండ్స్ నూతన స్టోర్ ప్రారంభం



ప్రజాశక్తి-క్యాంపస్: భారతదేశంలో అతి పెద్ద, వేగంగా వద్ధి చెందుతున్న అప్పారెల్, ఫుట్వేర్, యాక్ససరీస్ ప్రత్యేక చైన్ రిలయన్స్ ట్రెండ్స్ తిరుపతిలోని తుడా రోడ్డు ప్రాంతంలో తమ నాల్గో నూతన స్టోర్‌ను ప్రారంభించింది. 19,030 అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉంది. అలాగే ఈ స్టోర్ తిరుపతి ప్రాంతపు వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటైన ధరలో చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉంది. ఈ పట్టణానికి చెందిన కస్టమర్లు సంతప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మెన్స్‌వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురుచూడవచ్చు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3999 షాపింగ్ చేస్తే రూ.249 కి ఆకర్షణీయమైన బహుమతి పొందవచ్చు. అంతే కాదు రూ.3999 కొనుగోలు పై వినియోగదారులు రూ.2000 విలువగల కూపన్లు పూర్తి ఉచితంగా పొందగలుగుతారు. గొప్ప ఫ్యాషన్ షాపింగ్ అనుభవాన్ని ఆనందించడానికి ఇప్పుడే తిరుపతి తుడా రోడ్ ప్రాంతంలోని ట్రెండ్స్ స్టోర్ కి వెళ్లండి.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు



ప్రజాశక్తి-క్యాంపస్ : మానవుడు తన జీవితంలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పరిపాలన భవనం నుంచి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ విద్యార్థులు చిరుధాన్యాల ఆవశ్యకతను ప్రాముఖ్యతను ప్రజలలో విస్తతంగా చిరుధాన్యాలు తమ జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా పరిపాలన భవనం నుంచి ప్రారంభించిన ర్యాలీ రెండవ గేటు, విసి బంగ్లా, బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ వరకు వెళ్లి తిరిగి ప్రకాశం భవనం దగ్గరలోని హోమ్‌సైన్స్ వద్దకు చేరుకున్నారు. హోమ్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.వి. సుచరిత, డాక్టర్ కే.అనురాధ, డాక్టర్ బి.స్వరూప రాణి, డాక్టర్ అనిత, డాక్టర్ నీరజ, డాక్టర్ సింధుజ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం..!



ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పల్లెల్లో జరిగే అభివద్ధి పనులు వంద శాతం పూర్తి కావాలన్నా వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించాలని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. శనివారం రామచంద్రాపురం మండలం రావిళ్లవారిపల్లి పంచాయతీ పరిధిలో "గడపగడపకు మీ హర్షిత్ " కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన మేలు, ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పల్లెల్లో పరుగులు పెట్టించిన ప్రగతి పనులను వివరించారు.

ఆర్ఐఎంసీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్‌లో 2024 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి ప్రవేశానికై జాతీయ స్థాయిలో 02 డిసెంబర్ 2023న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత డా. ఎన్.విశ్వనాథ రెడ్డి తెలియజేశారు. ఈ పరీక్షకు 02 జులై 2011 నుంచి 01 జనవరి 2013 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని, ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తుల కోసం మరిన్ని వివరాలకు 9399976999 / 8688888802/03 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

మహిళా వర్సిటీలో చిత్రలేఖన పోటీలు



ప్రజాశక్తి-క్యాంపస్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ 9, 10, 13, గృహ విజ్ఞాన శాస్త్ర విభాగము కలిసి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. తల్లిపాలలోని పోషకాల గురించి.. వాటి ప్రాముఖ్యత గురించి చిత్రాలను గీశారు. ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, గృహ విజ్ఞానశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బిందు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ సుజాత, గృహ విజ్ఞాన విభాగానికి చెంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుని సేవలో ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి-క్యాంపస్: మంచినీళ్ల గుంట వద్దనున్న శ్రీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరుడిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దర్శించుకున్నారు. మొదటగా శివాలయంలోని శనీశ్వరునికి పూజలు చేయించి, తర్వాత శ్రీవిశాలాక్షి సమేత శివుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సూర్యనారాయణ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ, ఉమామహేశ్వర శర్మలు వేద ఆశీర్వాదంతో తీర్థప్రసాదాలను అందించారు.


శూలం వితరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయానికి పట్టణంలోని బహుదూర్ పేటకు చెందిన మోహన్ శనివారం రూ.15 వేలు విలువజేసే శూలంను వితరణ చేశారు. త్వరలో జరగనున్న ఆడికత్తిక ఉత్సవాల్లో ఈ స్థలాన్ని స్వామివారికి ధరించాలని ట్రస్ట్‌బోర్డ్‌కు సూచించారు. ధర్మకర్తల సభ్యులు బుల్లెట్ జయశ్యాం, పసల సుమతి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష


గూడూరు రూరల్...


చిన్నగొట్టిగల్లులో..


బుచ్చినాయుడుకండ్రిగలో..

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : తల్లిపాలు అమతం.. బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమావతి పేర్కొన్నారు. శనివారం గూడూరు మండల పరిధిలోని విందూరు జిఎస్ కండ్రిగలో తల్లిపాల వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ ప్రసవించిన అనంతరం మొట్టమొదటి సారిగా ముర్రుపాలను బిడ్డకు తప్పనిసరిగా అందివ్వాలని, ముర్రుపాలు రోగనిరోధక శక్తి కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కోటేశ్వరి, స్వర్ణలత, అరుణ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు. కోట: వెంకన్నపాలెం పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం అంగన్వాడీ సీడీపీవో మునికుమారి, అంగన్వాడీ సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఐ.కృష్ణమ్మ, ఏఎన్ఎం నిరోషా, ఎంఎల్‌హెచ్‌పి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: తల్లిపాల వారోత్సవాలను వైద్యాధికారి డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'అమ్మను మించిన దైవం, అమ్మపాలను మించిన అమతం' ఈ సృష్టిలో మరొకటి లేదన్నారు. నేటికీ కొందరు మూఢనమ్మకాలతో రెండు, మూడు రోజులవరకు తల్లిపాలు శిశువులకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ ప్రసవించిన వెంటనే గంటలోపు బిడ్డకు తల్లులు పాలు పట్టాలని..ఈ పాలు ప్రొలాక్టిన్ అనే హార్మోన్ తో ఉత్పత్తి అవుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శశికళ, ఎంపీహెచ్‌వో అమర్నాథరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, సూపర్వైజర్స్ సుబ్రహ్మణ్యం వసంతకుమారి, ఏఎన్ఎం రాధిక, ఆశా వర్కర్స్ చిట్టెమ్మ, హంస పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: పల్లమాల పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాలలో సుమారు 20 మంది గర్భిణులకు జగనన్న కిట్లను సర్పంచ్ జెవి. రమణమ్మ, వైఎస్ఆర్‌సిపి నాయకులు జొన్నల గోపాలరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సూపర్ణ, సుధారాణి, శశిరేఖ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్ రెడ్డి, గిరిధర్ పేర్కొన్నారు. శనివారం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో బజాజ్ ఫిన్‌సర్వ్ సంయుక్తంగా బిఎఫ్ఎస్ఐ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమరాల్డ్స్ డైరెక్టర్లు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు భవిష్యత్తు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, కమ్యూనికేషన్స్‌పై ప్రత్యేకంగా 60 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాధముని, పార్థసారధి, ప్రిన్సిపల్ జాఫర్‌వల్లీ పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి కృషి




ప్రజాశక్తి-కోట: గూడూరు నియోజకవర్గ స్థాయిలోని మసీదు కమిటీ ఛైర్మన్ల సమావేశం వాకాడు జామియా మసీదులో శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గూడూరు నియోజకవర్గ మసీదు కమిటీ ఛైర్మన్ల ప్రెసిడెంట్, కోట ఎంపీటీసీ షేక్. ముబీన్‌బాషా పాల్గొన్నారు. సమావేశంలో మసీదులు, శ్మశాన వాటికలు, పలు అభివద్ధి కార్యక్రమాల గురించి ప్రెసిడెంట్ షేక్. మొబిన్‌బాషా దష్టికి తీసుకొచ్చారు. గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు, ఆర్డీవో కిరణ్ కుమార్‌ల దష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని ఆయన తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి వీఎస్ఆర్ విద్యార్థులు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వి.యస్ .ఆర్ పాఠశాలలో చదివిన విద్యార్థులు నీట్ , ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల డైరెక్టర్ బాలకష్ణంరాజు పేర్కొన్నారు. తమ పాఠశాలలో ప్లే క్లాస్ నుంచి పదో తరగతి వరకు పూర్తి చేసుకున్న విద్యార్థిని సి.హెచ్. నూతన లక్ష్మి (582) ట్రిపుల్ ఐటి ఒంగోలు, సి.హెచ్ రిషిత నీట్‌లో సీట్ సాధించినందుకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత కుమార్ , కరస్పాండెంట్ అన్నపూర్ణ , ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ యూనిట్ ప్రారంభం



ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా నిర్మించిన మినరల్ వాటర్ యూనిట్‌ను జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. దాసుకుప్పంలో నడుస్తున్న గ్రామీణ క్రిస్టియన్ లెఫర్స్ సంక్షేమ అసోసియేషన్ రూ.పది లక్షల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న మినీ వాటర్ ట్యాంకు, నీటిశుద్ధి యంత్రాల ఏర్పాటుతోపాటు నూతన బోరు, మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లను నిర్మించారు. కళాశాల అధ్యాపకులు అరవింద్, హాన్న, హరిప్రసాద్, మురళీమోహన్, ఢిల్లీప్రసాద్, రవిశంకర్, సుధాకర్, బాషా, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీరపల్లి హేమచంద్రరావు జయంతి

ప్రజాశక్తి-పాకాల: మండలంలోని దామలచెరువుకు చెందిన న్యాయవాది వీరపల్లి హేమచంద్రరావు జయంతి సందర్భంగా శనివారం దామలచెరువు పాస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హేమ చంద్రరావు సతీమణి సూర్య కుమారి, కుమారుడు చిరంజీవి, కుమార్తె భార్గవి, శిష్యుడు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అందరికీ ఆమోదంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు

స్వల్ప మార్పులతో ప్రతిపాదన



ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు, అధ్యాపకులు, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మేధావులతో కలిసి శనివారం సెనేట్ హాల్లో సమావేశం, చర్చ వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మొదటి గేటు అవతల ఉన్నటువంటి గ్యాస్ గోడౌన్ సందులో ఆర్ట్స్ కళాశాల గోడకు ఆనుకొని 80 అడుగుల రోడ్డును, ఎన్సీసీ నగర్‌లో వెటర్నరీ విశ్వవిద్యాలయం ప్రహరీ ఆనుకొని 100 మీటర్ల మాస్టర్ ప్లాన్ రోడ్లకు సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ముఖ్యంగా వర్సిటీలోని థర్డ్ గేట్ మీదుగా వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డుకు అన్ని వర్గాల నుంచి పూర్తిస్థాయిలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయిందని, అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ తాము ఈ మాస్టర్ ప్లాన్లకు సూచిస్తున్నామని అభినయ్ చెప్పారు. రాయలసీమ మేధావులు డాక్టర్ భూమన్ మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది అందరి ఆమోదయోగ్యంగా మాస్టర్ ప్లాన్లు స్వల్ప మార్పులు చేయడం జరిగిందన్నారు. వర్సిటీకి ఎటువంటి సంబంధం లేకుండా ఎన్సీసీ నగర్ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రహరీ ఆనుకొని ఓ రోడ్డును, గ్యాస్ గోడౌన్ పక్కన మరొక రోడ్డును యూనివర్సిటీకి సంబంధం లేకుండా యూనివర్సిటీకి చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేస్తామని సూచించారు. వర్సిటీ అధికారులు, తుడ అధికారులతో పూర్తి స్థాయిలో చర్చించి ఈ మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, రెడ్డి భాస్కర్ రెడ్డి, మురళీరెడ్డి, ఇతర సంఘాల నేతలు పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-క్యాంపస్: వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని.. విద్యార్థులలో అవగాహన పెంచడాని కోసం స్కూల్ కన్స్యూమర్ క్లబ్ లను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖధికారి డా.వి.శేఖర్ పిలుపునిచ్చారు. జిల్లా ఆహారం, పౌర సరఫరాలు శాఖ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఒక్కరోజు శిక్షణ ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కె.రాజారఘువీర్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, తూనికలు కొలతలలో జరిగే మోసాలు, వినియోగ దారుల హక్కులు, బాధ్యతలను విద్యార్థులు నేర్చుకొని తమ తల్లిదండ్రులకు నేర్పడంతో తెలివైన కొనుగోలు చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలకంఠ, చెంచు కుమార్, నాగరాజు, హరిశంకర్, సురేష్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటి, నర్మద పాల్గొన్నారు.

అమరరాజాను సందర్శించిన యూఎస్ కౌన్సిల్ జనరల్ సభ్యులు



ప్రజాశక్తి -రేణిగుంట: అమరరాజ సంస్థతో కలిసి ఎనర్జీ రంగంలో పనిచేయడానికి వ్యాపార అవకాశాలు పరిశీలిస్తున్నామని యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని కరకంబాడి సమీపంలోని అమరరాజా ఫ్యాక్టరీనీ యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ వారి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ అమరరాజ సంస్థతో కలిసి ఎనర్జీ రంగంలో కలిసి పనిచేయడానికి వ్యాపార అవకాశాలు పరిశీలిస్తున్నామని అన్నారు. మొబిలిటీ గ్రీన్‌ఎనర్జీ రంగాలలో అవకాశాలను పరిశీలిస్తున్నామని అన్నారు. ఇప్పటికే అమరరాజ సంస్థ ఈరంగంలో మంచి పురోగతిని సాధిస్తున్నదని అన్నారు. ఈరంగంలో అమరరాజతో కలిసి పనిచేయడానికి వ్యాపార అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. అమరరాజ వివిధ రంగాలలో మంచి వ్యాపార పురోగతిని సాధిస్తున్నదని కర్మాగారం లోపల పరిసర ప్రాంతాలులో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నదన్నారు. అమరరాజా బ్యాటరీస్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులునాయుడు, ప్రెసిడెంట్ న్యూఎనర్జీ బిజినెస్ విజయానంద్ మాట్లాడుతూ యూఎస్ కౌన్సిల్ జనరల్ మా అమరరాజ సంస్థని సందర్శించడం మాకు చాలా సంతోషదాయకమని ధన్యవాదములు తెలియజేస్తున్నామని అన్నారు. ఇలాంటి సందర్శన వలన మా సంస్థ పరిమాణాలను ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా తెలియటానికి దోహదపడుతుందన్నారు. యూఎస్ కౌన్సిల్ జనరల్ మాసంస్థ పాటిస్తున్న అంతర్జాతీయ పరిమాణాలను ప్రశంసించడం మాకు మాఉద్యోగుల పనితీరు నిబద్ధతకు నిదర్శనమన్నారు. మా సంస్థతో కలిసి పని చేయడానికి ఆసక్తి చూపెడుతున్నందుకు యుఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తోపాటు యూఎస్ వైస్‌కౌన్సిల్ అఖిల్ బెరీ, వాణిజ్య సలహాదారు సునీల్‌కుమార్, ఆర్థిక వ్యవహారాల నిపుణుడు సిబా త్రిపాఠి, సెక్యూరిటీ ఇన్వెస్టిగేటర్ కిరణ్ పాలవరుపు అమర రాజా బ్యాటరీస్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులు నాయుడు, ప్రెసిడెంట్ న్యూఎనర్జీ బిజినెస్ విజయానంద్, అమరరాజ బ్యాటరీస్ అంతర్జాతీయ మార్కెటింగ్ హెడ్ ఇండివర్, అమర రాజా ఇన్ఫ్రాపవర్ డివిజన్ హెడ్ ద్వారక, లిథియం బ్యాటరీ ప్లాంట్ ఆపరేషన్స్ అండ్ ప్రోజెక్ట్ హెడ్ నిరంజన్, అమరరాజ బ్యాటరీస్ ఆటోమోటివ్ విభాగం హెడ్ శ్రీనివాసరావు, సర్వీస్ విభాగం హెడ్‌ఎస్ఎల్ఆర్ నాయుడు, రాజన్న ఫౌండేషన్‌హెడ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు సహకారం అందేనా..!

హక్కులు, సాయం కోసం నిరంతర పోరాటం: చిన్న రెడ్డిబాబు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చేనేత ఒకప్పుడు భారతదేశ స్వాతంత్య ఉద్యమంలో ప్రజలందరినీ ఐక్యం చేయడానికి విదేశీ వద్దు.. స్వదేశమే ముద్దు అంటూ తీసుకున్న నినాదం ఆనాటి రోజుల్లో ప్రజలను చైతన్యవంతులు చేసి ఉద్యమంలో కీలకపాత్రను పోషించింది. అయితే ఎందరో త్యాగధనుల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యం తరువాత మన దేశంలో చేనేతల పరిస్థితి, వారి కుటుంబాల దుస్థితి దయనీయంగా మారిపోయింది. ఎందరో నాయకులు చేనేతల బతుకులు మారడానికి చర్యలు తీసుకొన్నారు. మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఓ టీవి ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ చేనేతకు చేయూత ఇవ్వాలని.. చేనేతలు నేసిన వస్త్రాలనే ధరిస్తారన్నారు. ఇంత గొప్ప ఆలోచన ఈ రోజుల్లో ఉన్నవారు ఆలోచించకపోవడం, చేనేతలు వారి వృత్తిని వదిలేసి ప్రత్యామ్నాయ వృత్తులపై దృష్టి సారించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాస్తవ చేనేత సామాజిక వర్గానికి చెందిన వారి కన్నా బ్రతుకుదెరువు నిమిత్తం చేనేత వృత్తులు చేసుకునే వారు నేడు ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును అందుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేవు. సీగన్‌మోహన్ రెడ్డి నేతన్న నేస్తం పథకం ద్వారా ఇచ్చే 24 వేలతో పెరిగిన జరి, పట్టు, ముడి సరుకులతో నేతన్న బాగుంటారని ప్రభుత్వం ఆలోచించడం ఎంత వరకు సమంజసమో ప్రభుత్వ పెద్దలే పునరాలోచించుకోవాలని జాతీయ చేనేత ఐక్యతవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు చెబుతున్నారు. వాస్తవానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలను ఆదుకోవాలని, చేనేతల సంపూర్ణ అభివృద్ధి ఏ నిర్ణయాలను తీసుకోవపోవడం బాధాకరమన్నారు. ఏపీలో 19 ఉపకులాలుగా ఉన్న చేనేతల జనాభా 17 శాతంగా ఉంది. అయితే ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహకారం అందక, అప్పులు తెచ్చి బతుకు బండిని కదిపిన కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకొని కుటుంబాలు చిన్నాభిన్నమై ఊళ్లనే విడిచిపెట్టిన పరిస్థితులు ఉన్నాయి. చేనేతలు ఆనందంగా ఆగస్టు 7న చేనేత దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రభుత్వం యోచించడం సబబేనా. చేనేతల హక్కులు, వారికి ప్రభుత్వాల నుండి పూర్తి సహకారాలు అందిన రోజే నిజమైన చేనేత దినోత్సవమని.. ఇందుకు పోరాడుతూనే ఉంటామని చిన్నరెడ్డిబాబు స్పష్టం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాశక్తి-ఓజిలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అవినీతికి తావు లేకుండా ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. బట్లకనుపూరు గ్రామంలో ఎంపీపీ అరుణారెడ్డి, సర్పంచ్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీందర్ రాజు, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాషా , తహశీల్దార్ శివరామ సుబ్బయ్య , ఎంపీడీవో రజనీకాంత్, ఎస్.ఐ దారం ఆదిలక్ష్మి, వైసీపీ నాయకులు కనుమూరు గోపాల్ రెడ్డి, దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉచ్చూరు హరినాథ్ రెడ్డి, పాదార్తి హరినాథ్ రెడ్డి, రాజారాంరెడ్డి, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి , బాబు రెడ్డి , కొండూరు ప్రభాకర్ రాజు, అనిల్ , పృథ్వి కృష్ణ , వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుచానూరులో వైద్యసేవలు



ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరులో శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీ తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాయకులు మునీంద్ర రాయల్, చంద్ర, ఎంపీటీసీ నరేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వాసు, వెంకటేష్, యోగా, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు, వీఆర్వో మల్లికార్జున్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ధర్నా



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుంగనూరులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటనలో జరిగిన రణరంగం కారణంగా శనివారం పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద మంత్రి పెద్దిరెడ్డి పిలుపుమేరకు వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, డీఎన్ ఏలుమలై ,(అమ్ములు), రాజశేఖర్‌రాజు, నారాయణబాబు, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగ: పుంగనూరు నియోజకవర్గంలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోలేక దౌర్జన్యాలకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పాల్పడుతున్నారని జిల్లా వైసీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాజేష్ తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డులో పుంగనూరులో జరిగిన దాడులకు నిరసనగా రాస్తారోకో నిర్వహించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు జొన్నల గోపాల్ రెడ్డి, రవిరెడ్డి, ఒగ్గుమూడి గురునాథం, వైస్ ఎంపీపీ మునికష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, ప్రసాద్, పాల్, ఏఎంసీ డైరెక్టర్ కోటేశ్వరరావు, జయచంద్ర నాయుడు, గిరి, గుర్రప్ప నాయుడు, మునిరాజ, హేమంత్, యుగంధర్‌రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నరసింహులునాయుడు మృతికి నివాళులు




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కైలాసపురానికి చెందిన కొరపాటి నరసింహులునాయుడు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ గ్రామానికి చేరుకుని మృత దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, బుజ్జి, కైలాసపురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గూడూరులో వ్యక్తి దారుణ హత్య



ప్రజాశక్తి -గూడూరు : గూడూరు పీఎస్ఆర్ పార్క్ వద్ద వెంకయ్య(45) శుక్రవారం అర్ధరాత్రి దారుణహత్యకు గురయ్యాడు. పాత కక్షలు నేపథ్యంలో కళ్లల్లో కారం చల్లి కత్తులతో దాడి చేయడంతో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి హత్య చేయడంలో నలుగురు వ్యక్తులు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో చేరిన బొల్లినేని



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి పట్టణానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో రాచగున్నేరి పంచాయతీ మాజీ సర్పంచ్, జే.కే స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథంనాయుడు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు.